
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

శ్రీసత్యసాయి
జిల్లా వార్తలు
ఆదివారం 18 ఫిబ్రవరి 2024





ఆర్టీసీ బస్సుకోసం గాండ్లపెంట బస్టాండ్‌లో వేచి ఉన్న మహిళలు



అనంతలో ఏర్పాట్లు..

- బస్సెక్కితే రూ.500.. మందు, మాంసాహారం
- జనానికి ఎర వేస్తున్న వైసీపీ స్థానిక నాయకులు
- వైసీపీ అధీనంలో ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు
- జిల్లా వ్యాప్తంగా ప్రయాణికులకు తప్పని పాట్లు



కుటుంబ సభ్యులతో కదిరి పుణ్య క్షేత్రానికి వచ్చి హిందూపురంలో ఇరుక్కుపోయిన కర్ణాటక వాసులు.. చంటిబిడ్డతో అవస్థలు పడుతున్న వృద్ధురాలు

ఏమి తిప్పలో..!



సిద్ధం సభ జనసమీకరణకు నాయకుల పాట్లు

వైసీపీ సిద్ధం సభకు జనసమీకరణ చేయలేక అధికార పార్టీ నాయకులు పాట్లు పడుతున్నారు. మండల, పట్టణ, గ్రామ స్థాయిలో జనసమీకరణ టార్గెట్ పెట్టారు. ఈ నేపథ్యంలో శనివారం నుంచి నియోజకవర్గాల పరిధిలో ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, నాయకులు జనసమీకరణ చేపట్టారు. రాయలసీమ స్థాయి సభను రాప్తాడులో ఆదివారం నిర్వహిస్తున్న నేపథ్యంలో వైసీపీ నేతలకు జనసమీకరణ తలనొప్పిగా మారింది. సీఎం సభకు వస్తే మందు, విందు, పైఖర్చులకు డబ్బులిస్తామని గ్రామాల్లో జనాన్ని బతిమాలుతున్నారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల నుంచి 50 వేల మంది తరలించాలని వైసీపీ అధిష్టానం ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలకు హుకుం జారీ చేసింది. 'బస్సులను మేము పంపిస్తాం. బలవంతంగానైనా సభకు జనాన్ని తీసుకురావాలి' అని ఆదేశించింది.

\- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి

వైసీపీ అధీనంలో బస్సులు

జిల్లాలో 245 ఆర్టీసీ బస్సులతోపాటు అన్నమయ్య, చిత్తూరు జిల్లాల నుంచి మరో 250 ఆర్టీసీ బస్సులు, జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి 400 బస్సులను పల్లెలు, పట్టణాలకు పంపుతున్నారు. జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులన్నీ శనివారం రాత్రే వైసీపీ నాయకులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. కియ అనుబంధ సంస్థలకు ప్రైవేట్ ట్రావెల్స్ అదనపు బస్సులను సైతం సీఎం సభకు వినియోగిస్తున్నారు. చిత్తూరు జిల్లాలోని పలు ఆర్టీసీ డిపోల నుంచి బస్సులు శనివారం మధ్యాహ్నమే గ్రామాలకు చేరాయి. సభకు జనాన్ని తరలించే ఖర్చుల నిమిత్తం ఒక్కో బస్సుకు రూ.10 వేల ప్రకారం నగదు అందజేశారు.

మందు.. విందు..

కర్ణాటక సరిహద్దు నియోజకవర్గాలకు కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు భారీగా చేరుకున్నాయి. సభకు వచ్చే వారికి నాన్‌వెజ్ భోజనం, మద్యం ప్యాకెట్లు ఇచ్చేందుకు సిద్ధం చేశారు. ఏయే ప్రాంతాల నుంచి ఎంత మందిని, ఎలా సేకరించాలన్న వివరాలను ఎమ్మెల్యేలు, సమన్వయకర్తల సారథ్యంలో క్లస్టర్ల వారీగా గృహసారథులు, వైసీపీ సర్పంచులు, నాయకులకు అప్పగించారు. సభకు ఖచ్చితంగా వెళ్లాలని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పథకాల లబ్ధిదారులకు హుకుం జారీ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా శనివారం మధ్యాహ్నం నుంచి ఆర్టీసీ బస్సులు తమకు కేటాయించిన ప్రాంతాలకు వెళ్లాయి. దీంతో సాధారణ ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండ్లు, ప్రధాన కూడళ్లలో బస్సుల కోసం పడిగాపులు కాస్తూ, ఇబ్బందిపడ్డారు.



పుట్టపర్తిలో ఎదురుచూపులు..

ప్రయాణికులకు ఇక్కట్లు

గాండ్లపెంట: సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులను పంపడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు శనివారం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సులు లేకపోవడంతో గంటల తరబడి వేచి ఉంటూ కిక్కిరిసిన ప్రైవేటు వాహనాల్లో గమ్యాలకు చేరుకోవాల్సిన దుస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. కదిరినుంచి అన్నమయ్య జిల్లా వాసులకు బస్సులు లేకపోవడంతో పొద్దుపోయేవరకు వేచి ఉంటూ ప్రయాణికులు విసిగిపోయారు. ప్రజల సౌకర్యాలను మరిచి, సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులు మళ్లించడం ఏమిటని పలువురు ప్రశ్నించారు.

కార్యకర్తల జేబులు కట్ ?



కదిరి: సిద్ధం సభకు కార్యకర్తలను తరలించడానికి వైసీపీ అధిష్ఠానం బస్సుకు రూ.80వేలు ఇస్తే, తీరా ఆ బస్సును మెయిన్‌టెన్ చేసే కార్యకర్తకు రూ.11వేలు మాత్రమే చేరినట్లు సమాచారం. రవాణా కాకుండా ఒక్కొక్క కార్యకర్తకు రూ.2 వేలు వంతున ఇచ్చినట్లు సమాచారం. ఇందులో టిఫిన్, భోజనంతోపాటు వారి దారి ఖర్చులుకూడా ఉన్నాయి. కార్యకర్తలకు ఒక్కొక్క బస్సుకు రూ.11వేలు మాత్రమే స్థానిక నాయకులకు పంపినట్లు సమాచారం. మిగిలిన సొమ్ము ఎవరు తిన్నారో, ఎవరి జేబుకు చేరిందో దేవుడికే తెలియాలని స్థానిక నాయకులు చర్చించుకుంటున్నట్లు తెలిసింది.

ఎరక్కపోయి వచ్చాము

హిందూపురం అర్బన్: వివిధ పనుల నిమిత్తం ఉదయం హిందూపురం వచ్చిన వారు సాయంత్రం తిరిగి వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గౌరిబిదనూరుకు చెందిన ఓ కుటుంబం కదిరి నరసింహస్వామి దేవాలయానికి శనివారం వెళ్లి రాత్రి అక్కడే నిద్రచేసి మరుసటి రోజు పూజలు చేయించుకొని రావాలని హిందూపురం వచ్చారు. ఇక్కడకు వచ్చిన తరువాత ఎంత సేపటికి బస్సులు రాకపోవడంతో విచారిస్తే బస్సులు లేవని తెలిసింది. వెనుతిరిగి పోదామంటే కూడా బస్సులు రాలేదని ఆవేదన చెందారు. రాత్రి కావడంతో చిన్న పిల్లలతో ఇక్కడ ఎలా ఉండాలని ప్రశ్నిస్తున్నారు. పెనుకొండకు చెందిన ఓ బాలింత చెకప్ కోసం చంటిబిడ్డను ఎత్తుకుని వృద్ధురాలిని తోడుగా తీసుకుని హిందూపురం ఆసుపత్రికి వచ్చారు. పరీక్షలు చేయించుకొని సాయంత్రం తిరిగి వెళ్లాలని బస్సు కోసం వేచి ఉన్నారు. ఎంత సేపటికీ బస్సులు రాలేదు. విచారిస్తే బస్సులు లేవన్నారు. చంటి బిడ్డతో చలిగాలికి ఎలా ఉండాలని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా చాల మంది విషయం తెలియకుండా వచ్చి ఇబ్బందులు పడ్డారు.

వెళ్లొద్దు మాస్టర్..!

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

ఉపాధ్యాయులకు పోలీసుల నోటీసు

చలో విజయవాడ భగ్నానికి ప్రయత్నాలు

జిల్లా వ్యాప్తంగా ఏపీ జేఏసీ నిరసనలు

సీపీఎస్ రద్దు కోరుతూ చలో విజయవాడకు పిలుపునిచ్చిన ఉపాధ్యాయ సంఘాలకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు నోటీలు ఇచ్చారు. విజయవాడకు వెళ్లొద్దని హెచ్చరించారు. కదిరిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యూటీఎఫ్ జిల్లా అడహక్ కమిటీ సభ్యుడు మల్లికార్జునకు పోలీసులు నోటీసు ఇచ్చారు. తలుపులలో సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాయలసీమ కన్వీనర్ తలమర్ల ప్రభాకర్‌కు నోటీసులు అందించారు. హిందూపురం వన్‌టౌన్ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు 20 మంది సీపీఎస్ ఉద్యోగులకు నోటీసులు ఇచ్చారని తెలిసింది. దీంతో చాలా మంది ఫోన్‌లు స్విచ్చాఫ్ చేసుకుని, చలో విజయవాడకు వెళ్లినట్లు తెలిసింది. ముదిగుబ్బ ప్రాథమిక పాఠశాలలలో విధులు నిర్వహిస్తున్న సీపీఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు రఫీ, షబ్బీర్, కుళ్ళాయప్పకు నోటీసులు ఇచ్చారు.

తాడిమర్రి మండలంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు శ్యామ్యూల్ విక్టర్, ప్రధాన కార్యదర్శి నారాయణ స్వామి, ఏపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర, నాగిరెడ్డికి పోలీసులు నోటీసులు అందజేశారు. ఓబుళదేవర చెరువులో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గౌస్‌లాజంకు పోలీసులు నోటీసులిచ్చారు. శాంతియుత ఉద్యమాలను నోటీసులతో ఆపలేరని గౌస్‌లాజం అన్నారు. గోరంట్ల మండలంలో సీపీఎస్ ఉద్యోగుల సంఘం మండల గౌరవాధ్యక్షుడు సుబాష్ నాయక్, మండల అధ్యక్షుడు బాలక్రిష్ణ, కోశాధికారి అశోక్, శ్రీనివాసరాజులుకు నోటీసులు ఇచ్చారు.





కదిరి : ఉపాధ్యాయ సంఘాల నాయకులకు నోటీసులు అందిస్తున్న పోలీసులు



హిందూపురంలో సీపీఎస్ ఉద్యోగికి నోటీసు అందజేస్తున్న ఏఎస్ఐ



ఓడీసీ: డీటీఎఫ్ నాయకుడు గౌస్ లాజంకు నోటీసులిస్తున్న పోలీసులు

గోరంట్ల : టీచర్ అశోక్‌కు నోటీసులు అందిస్తున్న కానిస్టేబుల్





పుట్టపర్తి : ఏపీటీఎఫ్ నాయకుడు శ్రీనివాస్‌కు నోటీసు అందజేస్తున్న పోలీసులు

పుట్టపర్తి : ప్రభాకర్‌కు నోటీసులు అందజేస్తున్న పోలీసులు



పోరు ఆగదు

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించేంతవరకు పోరాటం ఆగదని ఏపీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు లింగా రామ్మోహన్ అన్నారు. పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో వివిధ సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీపీఎస్, జీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్నిశాఖలలో కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని అన్నారు. 12వ పీఆర్‌సీ మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని, సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్ ఇవ్వాలని, డీఏ, టీఏ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ భాగ్యరేఖకు వినతిపత్రం అందించారు.



పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న లింగా రామ్మోహన్

ఉద్యోగుల ఆగ్రహానికి గురికాకతప్పదు

ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోతే సీఎం జగన్ ఉద్యోగుల ఆగ్రహానికి గురికాక తప్పదని ఏపీ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘం నాయకులు హెచ్చరించారు. హిందూపురం తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం నిరసన చేపట్టారు. ఎంతో మంది ముఖ్యమంత్రులు పాలన సాగించారని, ఇంత దుర్మార్గపు పాలన ఏనాడూ లేదని అన్నారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సీపీఎస్‌ను రద్దు చేస్తామని జగన్ హామీ ఇచ్చారని, నమ్మి ఓట్లు వేస్తే మోసగించారని విమర్శించారు. కార్యక్రమంలో జేఏసీ మండల అధ్యక్షుడు నరసింహులు, మండల కార్యదర్శి మారుతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, హాజరైన ఉద్యోగులు



సిద్ధం సభకు వెళుతూ.. డివైడర్‌ను ఢీకొన్న స్కూల్ బస్సు



డివైడర్‌ను ఢీకొన్న ప్రైవేటు పాఠశాల బస్సు

తనకల్లు, ఫిబ్రవరి 17: సిద్ధం సభకు వెళుతున్న ఓ ప్రైవేటు స్కూల్ బస్సు మండల కేంద్రంలో శనివారం రాత్రి డివైడర్‌ను ఢీకొంది. ప్రమాద సమయంలో బస్సులో ఎవరు లేకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లి నుంచి దీక్షా ఉన్నతపాఠశాలకు చెందిన బస్సు సత్యసాయి జిల్లా రాప్తాడులో వైసీపీ నిర్వహిస్తున్న సిద్ధం సభకు ప్రజలను చేరవేసేందుకు వస్తుండగా తనకల్లులో ఉన్న డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి.

రిక్షా తొక్కి బతకాలా..?

నిరుద్యోగులను జగన్ మోసగించారు
ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్



రిక్షా తొక్కుతున్న విద్యార్థులు

హిందూపురం అర్బన్: డిగ్రీ చదివినవారికీ ఉద్యోగాలు రావడం లేదని, రిక్షా తొక్కి కుటుంబాలను పోషించాల్సి వస్తోందని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులతో కలిసి అంబేడ్కర్ సర్కిల్‌లో శనివారం రిక్షా తొక్కి, మూటలు మోసి నిరసన తెలిపారు. గ్రామీణ విద్యార్థులు కష్టపడి చదువుతున్నారని, వారి తల్లిదండ్రులు పస్తులు ఉండి బిడ్డలను చదివిస్తున్నారని అన్నారు. అలాంటి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా సీఎం జగన్ మోసగించారని విమర్శించారు. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్.. ఐదేళ్లు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న 23 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని మాట ఇచ్చి, ఆరు వేల పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారని అన్నారు. బెంగళూరు వంటి నగరాలకు వెళ్లి కార్మికులుగా, ఆటో డ్రైవర్లుగా పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వానికి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని నిరుద్యోగులకు పిలుపునిచ్చారు.

పెండింగ్ క్లైయిమ్‌ను పరిష్కరించండి : కలెక్టర్



పుట్టపర్తి, ఫిబ్రవరి 17: ఓటరు జాబితా సవరణలు, మార్పులపై పెండింగ్‌లో ఉన్న క్లైయిమ్‌లను సమగ్రంగా విచారించి, పరిష్కరించాలని కలెక్టర్ అరుణ్‌బాబు నియోజకవర్గ ఎన్నికల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శనివారం ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. త్వరలో ఎన్నికలు ఉంటాయని, ఓటర్ల నమోదుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న క్లైయిమ్‌లన్నింటినీ త్వరగా పరిష్కరించాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. మూడు రోజుల్లోపు ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులను కల్పించాలని, కులగణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. సమీక్షలో జేసీ అభిషేక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన ఐటీ సోదాలు

హిందూపురం, ఫిబ్రవరి 17: పట్టణంలో ఫైనాన్షియర్ అశ్విన్‌కుమార్ ఇల్లు, కార్యాలయంలో రెండో రోజు శనివారం కూడా ఆదాయ పన్ను శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సోదాలు శనివారం కొనసాగాయి. అధికారులు రెండు బృందాలుగా విడిపోయి సోదాలు నిర్వహించారు. శుక్రవారం రాత్రంతా కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. పలు రికార్డులు, పత్రాలను వెంట తీసుకెళ్లారని సమాచారం. తనిఖీల వివరాలను ఐటీ అధికారులు వెల్లడించలేదు.

ఆ రోజులు పోయాయి..!

డబ్బు ఇస్తేనే సభకు వస్తారు.. మద్యం, భోజనానికి గడప దాటరు.. పెద్దలకు తెగేసి చెప్పిన వైసీపీ నాయకులు

హిందూపురం, ఫిబ్రవరి 17: సిద్ధం సభకు జనం తరలించాలంటే డబ్బులు కావాల్సిందేనని వైసీపీ నాయకులు అన్నట్లు తెలిసింది. 'కర్ణాటక టెట్రా ప్యాకెట్, భోజనం ప్యాకెట్లకు జనం వచ్చే రోజులు పోయాయి. ఒక్కొక్కరికి కనీసం రూ.500 ఇస్తే తప్ప గడప దాటడం లేదు' అని హిందూపురం వైసీపీ నాయకులు పైస్థాయివారికి చెప్పినట్లు తెలిసింది. రాప్తాడులో ఆదివారం జరిగే సిద్ధం బహిరంగ సభకు హిందూపురం నుంచి భారీ ఎత్తున జనాలను తరలించాలని నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, నాయకులు బాబురెడ్డి, వేణురెడ్డి దిగువస్థాయి నాయకులను ఆదేశించారు. జన సమీకరణపై వైసీపీ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. వార్డుకు రెండు బస్సులు, పంచాయతీకి 3 నుంచి 5 బస్సులు పంపుతామని, అందుకు తగ్గట్టు జనాన్ని సిద్ధం చేయాలని నాయకులు సూచించారు. కర్ణాటక మద్యం టెట్రాప్యాకెట్, చిత్రాన్నం, పెరుగన్నం, వాటర్‌ప్యాకెట్లు అందజేస్తామని తెలిపారు. ఒక్కో బస్సుకు రూ.5వేల నుంచి రూ.10వేలు వరకూ ఇస్తామని చెప్పారు. దీనికి చాలా మంది నాయకులు ఒప్పుకోలేదని తెలిసింది. మద్యం, అన్నం ప్యాకెట్లకు జనాలు వచ్చే రోజులు పోయాయని, మహిళకు రూ.500, పురుషులకు రూ.700 ఇస్తేనే వస్తారని అన్నట్లు తెలిసింది. ఒకరోజు పని వదులుకుని రావాలి కాబట్టి కనీసం కూలి డబ్బులైనా వారికి ఇవ్వాల్సి ఉంటుందని, అప్పుడే వస్తారని మొహం మీదే చెప్పినట్లు సమాచారం. అలా అయితే పథకాలు అందుకున్నవారిని, మహిళా సంఘాల సభ్యులను తీసుకురావాలని నాయకులు సూచించినట్లు తెలిసింది. దీంతో 'స్థానికంగా జరిగే సమావేశాలకే వారు రారు.. అనంతపురానికి ఎందుకు వస్తారు..?' అని నిలదీసినట్లు సమాచారం. కొంతమంది తమకు బస్సులే వద్దని చెప్పేసి వెళ్లిపోయినట్లు సమాచారం. కాగా, సిద్ధం సభకు మద్యం, భోజనం సరఫరా చేసే బాధ్యతను అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్లకు అప్పగించినట్లు తెలిసింది.

జనాన్ని తరలించేందుకు సిద్ధంగా బస్సులు



నేడు అనంతలో వైసీపీ సిద్ధం సభ

అనంతపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల 'సిద్ధం' బహిరంగ సభను వైసీపీ నాయకులు అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం నిర్వహించనున్నారు. వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్ ఈ సభకు హాజరుకానున్నారు. బహిరంగ సభ ఏర్పాట్లను ఆ పార్టీ ముఖ్యులు, అధికారులు పర్యవేక్షిస్తున్నారు. సభకు పెద్ద ఎత్తున జనాన్ని తరలించేందుకు వైసీపీ నాయకత్వం కంటే అధికారులే ఎక్కువగా శ్రమిస్తున్నారు.

జగన్ పర్యటన ఇలా..

సిద్ధం బహిరంగ సభకు హాజరయ్యేందుకుగానూ సీఎం జగన్ ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు తన నివాసం నుంచి బయలుదేరి 1.50 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ప్రత్యేక విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి, 2.45 గంటలకు శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 2.55 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 3.15 గంటలకు రాప్తాడులో సిద్ధం వేదిక సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో ల్యాండ్ అవుతారు. 3.30 గంటల నుంచి 5 గంటల వరకూ సిద్ధం బహిరంగ సభలో పార్టీ శ్రేణులనుద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. సాయంత్రం 5.15 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 5.35 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం బయలుదేరి వెళతారు.

రామగిరిలో జెండాల వివాదం


జెండాలను తొలగిస్తున్న దృశ్యం

రామగిరి, ఫిబ్రవరి 17: మండల కేంద్రంలో కొద్ది రోజుల కిందట జయహో బీసీ సభ సందర్భంగా ఏర్పాటు చేసిన టీడీపీ జెండాలు, ఫ్లెక్సీలను శనివారం సాయంత్రం పోలీసులు, అధికారులు తొలగించేందుకు ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు అక్కడికి చేరుకుని వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. 60 కిలోమీటర్ల దూరంలో సీఎం సిద్ధం సభ జరుగుతుండగా ఇక్కడ టీడీపీ జెండా లను తొలగించే అవసరం ఏమిటని వారు ప్రశ్నించారు. సీఎం కార్యక్రమం జరుగుతున్నందున వైసీపీ నాయకులు కూడా తమ పార్టీ జెండాల, నాయకుల ఫ్లెక్సీలు కట్టుకోవాలని అంటున్నారని పోలీసులు వారికి తెలిపారు. అందుకే గొడవలు జరగకుండా ముందస్తుగా టీడీపీ జెండాలు, ఫ్లెక్సీలు తొలగిస్తున్నట్టు తెలిపారు. తాము ఎన్నో సార్లు ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్చ్‌పై వైసీపీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు ఇప్పుడు అత్యుత్సాం ప్రదర్శిస్తున్నారని టీడీపీ నాయకులు మండిపడ్డారు. టీడీపీకి ఎంతో బలమైన రామగిరి మండలంలోనే అధికారులపై ఎమ్మెల్యే ఒత్తిడి తెచ్చి దౌర్జన్యం చేయిస్తున్నా రని మిగిలిన చోట్ల దౌర్జన్యాలు ఏవిధంగా ఉంటాయో అర్థం చేసుకోవాలన్నారు. త్వరలో ఎన్నికలు రాబోతున్నాయి కావున అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించా లని కోరారు. పోలీసులు టీడీపీ నాయకులకు సర్దిచెప్పి ప్రధాన రహదారిలో ఉన్న జెండాలను తొలగించారు. చెప్పినట్టు వినకపోతే మీపై కేసులు నమోదు చేయాల్సి వస్తోందని పోలీసులు బెదిరింపులు కూడా చేశారు.

రేపటి నుంచి ఇంటింటికీ సీపీఎం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 17: తమ పార్టీ చేపట్టే ఉద్యమాల కోసం ప్రజల నుంచి విరాళాలు సేకరించేందుకు ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు నగరంలో ఇంటింటికీ సీపీఎం కార్యక్రమం చేపట్టనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ పేర్కొన్నారు. స్థానిక గణేనాయక్ భవన్‌లో ఇంటంటికీ సీపీఎం కార్యక్రమ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ ప్రజాసమస్యలపై నిజాయతీగా పనిచేయడం, ప్రజలిచ్చిన సొమ్మును వారికే వినియోగించడం సీపీఎం విధానమన్నారు. జిల్లాలో రైతు, వ్యవసాయ కూలీల సమస్యలపై సీపీఎం నిరంతరం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నల్లప్ప, సావిత్రి, బాలరంగయ్య, నగర కార్యదర్శులు రామిరెడ్డి, ఆర్వి నాయుడు పాల్గొన్నారు.

ఇద్దరు డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 17: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అనంతపురం జిల్లాలో పని చేస్తున్న ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో సివిల్‌సప్లై డీఎంగా పనిచేస్తున్న జె.రవీంద్రను కడపజిల్లా స్పెషల్‌డిప్యూటీ కలెక్టరుగా, ఎఫ్ఎస్ఓగా కొనసాగుతున్న మరో స్పెషల్‌డిప్యూటీ కలెక్టరు నీలమయ్యను కడప జిల్లా పీబీసీకి బదిలీ చేసింది. చిత్తూరు జిల్లా నుంచి శంకరయ్యను అనంత జిల్లా ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్(ఎఫ్ఎస్ఓ)గా నియమించారు.

నవ వధువు ఆత్మహత్య


లోడుగు గాయత్రి ఫైల్‌ఫొటో

గార్లదిన్నె, ఫిబ్రవరి 17: మండలంలోని మర్తాడు గ్రామంలో లోడుగు గాయత్రి (21)అనే నవ వధువు కడుపునొప్పి తాళలేక శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు... మర్తాడుకు చెందిన లోడుగు సుబ్బన్న, లక్ష్మీదేవి దంపతులు కుమార్తె గాయత్రికి వారం రోజుల కిందట పెద్దవడుగూరు మండలం కండ్లగూడురుకు చెందిన గణేష్‌తో వివాహమైంది. అయితే శుక్రవారం రాత్రి గాయత్రికి పుట్టింట్లోనే కడుపునొప్పి తీవ్రమైంది. ఆ నొప్పి భరించలేక ఊజీమాత్రలు మింగింది. కుటుంబ సభ్యులు 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. కాళ్ల పారాని ఆరకముందే కన్న బిడ్డ కాటికి చేరడంతో మృతురాలి తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోదించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

సీఎం సభకు బస్సులు.. ప్రయాణికుల పాట్లు

- బస్టాండ్లలోనే ప్రయాణికుల పడిగాపులు
- ఆర్టీసీ అధికారులను నిలదీసిన వైనం


ఆర్టీసీ బస్టాండులో బస్సు కోసం వెళ్తున్న ప్రయాణికులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 17: జిల్లాలోని రాప్తాడులో జరుగుతున్న వైసీపీ సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులను పంపడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు శనివారం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 857 ఆర్టీసీ బస్సులుండగా 543 బస్సులను శనివారం మధ్యాహ్నం నుంచే సిద్ధం సభకు మళ్లించారు. దీంతో పాఠశాలలు, కాలేజీలనుంచి ఊళ్లకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగం ముగించుకుని ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, వ్యాపారులు మొదలుకొని వివిధ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లే, వచ్చే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. బస్టాండ్ల లోనే గంటల తరబడి పడిగాపులు కాస్తూ అసహనానికి గురయ్యారు. ఒక దశలో బస్టాండులోని విచారణ కేంద్రంతోపాటు బస్టాండు మేనేజర్‌ను సైతం ముట్టడించి బస్సులు లేకుంటే తామెలా ఊళ్లకు వెళ్లాలని నిలదీశారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకే బస్సులను పంపాం, తామేమీ చేయలేమంటూ ఆర్టీసీ అధికారులు చేతులెత్తేశారు.

ఉరవకొండ: ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాప్తాడులో జరిగే సిద్ధం బహిరంగ సభకు బస్సులు అన్నీ వెళ్లడంతో ప్రయాణికులు బస్టాండ్‌లో బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించారు. డిపో పరిధిలో 52 బస్సులు ఉండగా 39 బస్సులు సీఎం పర్యటనకు వెళ్లాయి. గుంతకల్లు, రాయదుర్గం, అనంత పురం మార్గాల్లో కేవలం ఏడు బస్సులు మాత్రమే నడిచాయి. బళ్లారి మార్గంలో బస్సు సర్వీసులన్నీ రద్దు చేశారు. వేళకు బస్సులు లేక ఇబ్బందులు పడ్డారు.

మంత్రాలయం వెళ్లాలని వచ్చా



మంత్రాలయంలో మొక్కు తీర్చుకోవాలని బెంగళూరు నుంచి బయలు దేరి వచ్చా. ఇక్కడికి వచ్చాక బస్సుల్లేవంటున్నారు. సాధారణంగా సాయంత్రం 5.30 గంటలకు అనంతపురం నుంచి మంత్రాలయానికి బస్సు ఉంది. 4.30 గంటలకే అనంతపురం చేరుకుని బస్సుకోసం వేచిచూశా. ఎంతసేపటికీ బస్సు రాకపోవడంతో ఆర్టీసీ అధికారులను అడుగగా బస్సుల్లేవు, వెళ్లిపోండి అంటున్నారు. ఆర్టీసీ బస్సు సర్వీసులను నమ్ముకుని ఇంతదూరం వస్తే ఇలా చేయడం సరికాదు.

- రంజిత్, ప్రయాణికుడు

ప్రజలను ఇబ్బంది పెట్టరాదు



నాకు కంటి పరీక్షలతోపాటు నా మనవడిని ఆర్డీటీ స్కూల్‌లో చేర్పించేందుకు ఉదయం అనంతపురం వచ్చాము. పని ముగించుకుని పామిడికి వెళ్లేందుకు బస్టాండుకు వస్తే బస్సుల్లేవంటున్నారు. ఉన్న బస్సుల్లోనే అందరూ వెళ్లాలంటున్నారు. బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. బస్సులో ఇరుక్కుని అయినా వస్తాం, అవసరమైతే దూరప్రయాణం టికెట్ కొంటామన్నా బస్సులో ఎక్కించుకోవడం లేదు. రాజకీయ నాయకుల సభకు బస్సులను తరలించి మాలాంటి ప్రయాణికులను ఇబ్బంది పెట్టడం అన్యాయం.

- శ్యామల, గృహిణి, పామిడి

మధ్యాహ్నం నుంచి ఎదురుచూస్తున్నా



ఆస్పత్రిలో చూపించుకునేందుకు అనంతపురం వచ్చా. పని అయిన తర్వాత తాడిపత్రికి వెళ్దామని బస్టాండుకు వస్తే బస్సుల్లేవు. సాధారణ రోజుల్లో ప్రతి అరగంటకు తాడిపత్రికి బస్సు ఉండేది. ఈరోజు మధ్యాహ్నం 3 గంటలకు ఆర్టీసీ బస్టాండుకు వచ్చా. రాత్రి 8 గంటలయినా బస్సు చిక్కలేదు. బస్సు టిక్కెట్‌కి తప్ప డబ్బులు తెచ్చుకోలేదు. ఇపుడేమో బస్సుల్లేవంటున్నారు, మేము రోడ్లమీద పడాలా..? రాజకీయ నాయకుల సభ పేరుతో సామాన్యుల ప్రయాణానికి ఆటంకం కలిగిస్తే ఎలా..?

- వెంకటనాయుడు, తాడిపత్రి.

ఇష్టారాజ్యంగా సిద్ధం సభ ఫ్లెక్సీలు


మొక్కలు నాటాల్సిన స్థానంలో వైసీపీ జెండా కర్రలు నాటుతున్న కూలీలు


రహదారి సూచికలు, దూరాన్ని తెలిపే బోర్డులకు ఏర్పాటు చేసిన వైసీపీ ఫ్లెక్సీలు

రాప్తాడు, ఫిబ్రవరి 17: నియోజకవర్గ కేంద్రం రాప్తాడులో ఆదివారం నిర్వహించే సిద్ధం సభకు వైసీపీ నాయకులు ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. రాప్తాడు సమీపంలో ఆటోనగర్ వద్ద సిద్ధం సభ ఏర్పాటు చేశారు. జాతీయరహదారిలో ప్రయాణికులకు రహదారుల సూచికలు, దూరాన్ని తెలిపే బోర్డులకు సైతం ఫ్లెక్సీలు కట్టారు. జాతీయ రహదారుల్లో సూచికల బోర్డులకు ఎటువంటి రాజకీయ ఫ్లెక్సీలు కట్టరాదు. వైసీపీ నాయకులు నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా హైవే అధికారులు పట్టించుకోలేదు. వై జంక్షన్ వద్ద కూడా ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. రహదారి డివైడర్ల మధ్యలో మొక్కలు నాటాల్సిన ప్రదేశంలో వైసీపీ జెండా కర్రలు ఏర్పాటు చేశారు. సీఎం రాక సందర్భంగా రాప్తాడు వై జంక్షన్ వద్ద డివైడర్ల మధ్య ఉన్న ముళ్ల కంపలు, వ్యర్థాలు తొలగించలేదు. కానీ జాతీయ రహదారికి పక్కన గల అన్ని దుకాణాలకు వైసీపీ జెండాలు కట్టేశారు. సిద్ధం సభ ప్రాంగణం వద్ద వివాదాస్పద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.


జాతీయ రహదారి పక్కన దుకాణాలను సైతం వదలకుండా వైసీపీ జెండాలను కట్టిన దృశ్యం

పటిష్ట బందోబస్తు

- జిల్లా ఎస్పీ అన్బురాజన్

రాప్తాడు, ఫిబ్రవరి 17: ముఖ్యమంత్రి జగన్ సిద్ధం సభలో పాల్గొనేందుకు రాప్తాడుకు వస్తున్న సందర్భంగా బందోబస్తు పకడ్బందీగా ఉండాలని జిల్లా ఎస్పీ అన్బురాజన్ సిబ్బందిని ఆదేశించారు. సీఎం పర్యటన నేపథ్యంలో బందోబస్తుకు విచ్చేసిన పోలీసు అధికారులతో ఎస్పీ రాప్తాడులో సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ హెలీప్యాడ్, సభాస్థలి, పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ తదితర విధుల్లో ఏమి చేయాలో సూచించారు. సీఎం పర్యటన ప్రశాంతంగా జరిగేలా పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అనంతపురం, కడప, నంద్యాల జిల్లాల అదనపు ఎస్పీలు విజయ్‌భాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, లక్ష్మీనారాయణరెడ్డి, కృష్ణారావు, నాగేశ్వరరావు, ప్రవీణ్‌కుమార్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

హైవేపై అన్ని వాహనాలు వెళ్లవచ్చు

అనంతపురం క్రైం: సిద్ధం బహిరంగ సభ నేపథ్యంలో... బెంగళూరు-హైదరాబాద్ నుంచి భారీ గూడ్స్ వాహనాలు మినహా.. అన్ని రకాల వాహనాలు, ప్యాసింజర్ వాహనాలు, అత్యవసర వాహనాలు యథావిధిగా హైవే-44పై వెళ్లొచ్చని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. ప్రజలు, వాహన చోదకులు అసౌకర్యానికి గురికాకుండా ఆంక్షలు సవరించామన్నారు. పోలీసులతో సహకరించాలని ఆయన కోరారు.

నేటి నుంచి రంగనాథుడి బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో రంగనాథస్వామి

గుత్తి రూరల్, ఫిబ్రవరి 17: మండలంలోని తొండపాడు గ్రామంలో వెలిసిన బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 24న తెల్లవారుజామున శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారి కల్యాణాన్ని నిర్వహించడానికి ఆలయ ఈఓ సన్నాహాలు చేపట్టారు. సాయంత్రం స్వామివారి రథోత్సవం నిర్వహిస్తారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు రాయలసీమ జిల్లాల నుంచే కాకుండ కర్ణాటక రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి జమ్మిచెట్టు వరకూ ఊరేగిస్తారు.


స్వామి వారి గాలి గోపురం

ఈ ఆలయానికి శతాబ్దాల చరిత్ర

బొలికొండ రంగనాథస్వామి ఆలయానికి శతాబ్దాల చరిత్ర ఉంది. విజయనగర రాజుల కాలంలో ఆలయాన్ని నిర్మించారు. ఆనాటి కట్టడం ఇప్పటికీ చెక్కు చెదరలేదు. 300 అడుగుల ఎత్తులోని కొండ అగ్రభాగాన గుహలో స్వామి వారు స్వయం ఉద్భవ శిలగా అవతరించారు. కొండపైకి భక్తులు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతుండటంతో మూలవిరాట్టుకు ప్రతిరూపంగా స్వామివారి విగ్రహాన్ని కొండ దిగువన ఆలయంలో ప్రతిష్ఠించారు. 1969 నుంచి దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. పౌర్ణమి రోజు ఉదయం నుంచి భక్తులు ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు ఆటోలు గుడి చుట్టూ తిప్పుతుంటారు. వారం రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి.

వారం రోజుల పాటు ఉత్సవాలు

వారం రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమతాయని ఆలయ ఈఓ దేవదాసు తెలిపారు. ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులను పెళ్లి కుమారుడి అలంకారంలో జక్కలచెరువు గ్రామం నుంచి తొండపాడులోని ఆలయానికి పల్లకీలో తెస్తారు. రాత్రి 10 గంటలకు ధ్వజారోహణ అంకురార్పణతో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 19న సింహ వాహనోత్సవం, 20న శేష వాహనోత్సవం 21న హనుమత్‌వాహనోత్సవం, 22న గరుడ వాహనోత్సవం 23న గజవాహనోత్సవం 24న తెల్లవారుజామున స్వామి వారి కల్యాణోత్సవం, సాయంత్రం రథోత్సవం 25న పార్వేట అశ్వవాహనము, 26న వసంతోత్సవం, హంస వాహనోత్సవం, సాయంత్రం ఊంజలసేవతో ఉత్సవాలు ముగిస్తాయని వారు తెలిపారు.

మాజీ సర్పంచ్ చెన్నకేశవులుకు పరిటాల సునీత ఘన నివాళి


చెన్నకేశవులు భౌతికాయం వద్ద నివాళులర్పిస్తున్న పరిటాల సునీత, మాజీ ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ


నివాళులర్పిస్తున్న పెనుకొండ టీడీపీ నాయకురాలు సవితమ్మ, నాయకులు

రామగిరి, ఫిబ్రవరి 17: మండలంలోని కుంటిమద్ది పంచాయతీ శ్రీహరిపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకులు చెన్నకేశవులు (85)అనారోగ్యంతో శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పరిటాల సునీత, పెనుకొండ టీడీపీ నాయకురాలు సవితమ్మ, టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి తదితరులు శనివారం గ్రామానికి వెళ్లి చెన్నకేశవులు భౌతికాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చెన్నకేశవులు సోదరుడు, మాజీ ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ, కుటుంబసభ్యుల ను పరామర్శించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి చెన్నకేశవులు చేసిన సేవలను కొనియాడారు. శ్రీహరిపురం గ్రామంలో ఆయన అంత్యక్రియలను బంధువులు, కుటుంబసభ్యులు, టీడీపీ అభిమానులు నిర్వహించారు. టీడీపీ నాయకులు రామ్మూర్తినాయుడు, కుంటిమద్ది రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ ఆశయాలకు తూట్లు పొడిచిన జగన్

మాజీ మంత్రి రఘువీరారెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి రఘువీరారెడ్డి

మడకశిరటౌన్, ఫిబ్రవరి 17: దివంగత రాజశేఖర్‌రెడ్డి ఆశయాలకు తూట్లు పొడిచిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి ఎద్దేవా చేశారు. నీలకంఠాపురం కోల్డ్ స్టోరేజ్ వద్ద శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మరో వారం రోజుల్లో రాజశేఖర్‌రెడ్డి మృతి చెందుతారనగా 2014 ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానిని చేద్దామని తమ అందరితో ప్రమాణం చేయించారన్నారు. ఆయన మరణానంతరం ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సైతం కాంగ్రెస్ పార్టీ అభివృద్ధితోపాటు రాహుల్‌గాంధీని ప్రధానిని చేద్దామని చెప్పారన్నారు. అప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడిన వీడియో క్లిప్పింగ్‌లను విలేకరుల ఎదుట ప్రదర్శించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తనపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీద్వారా పైకొచ్చి మీరంతా మీ స్వార్థం కోసం కాంగ్రెస్ పార్టీని పొడిచి పొడిచి చంపారని విమర్శించారు. పుట్టపర్తి సాయిబాబా డబ్బులు తాను తరలించినట్లు మంత్రి పెద్దిరెడ్డి ఆరోపణలు చేయడం దారుణమన్నారు. దీనిపై ఇన్నేళ్లుగా ఎందుకు విచారణ చేయించలేదని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీని ప్రధానిని చెయ్యాలన్నది వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆశయం కానీ ఆయన ఆశయ సాధన కోసం కుమారుడిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏం చేశారో ఆదివారం జరిగే సిద్ధం సభలో ప్రజలకు చెప్పాలన్నారు. గత ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాకు మీరు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయలేదో సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కె.సుధాకర్, తదితరులు ఉన్నారు.

ఓటు భవిష్యత్తును నిర్ణయిస్తుంది: కందికుంట



విద్యార్థులతో కలిసి పోస్టర్ విడుదల చేస్తున్న కందికుంట

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 17: ఓటు మన భవిష్యత్తును నిర్ణయిస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక ఎన్జీవో హోంలో మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో మొదటిసారిగా ఓటు హక్కు వినియోగించుకునే యువత పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ పాలనలో యువతకు ఉద్యోగాలు లేక పెడదోవ పట్టారన్నారు. దేశంలో పట్టుబడిన గంజాయిలో ఎక్కువశాతం ఏపీలోనే అన్నారు. ఒక్కసారి అవకాశం ఇవ్వండి మీ భవిష్యత్‌ను మారుస్తానని గద్దెనెక్కిన జగన్ ఐదేళ్ల కాలంలో ఉద్యోగాలు భర్తీ చేయక, ఉన్న పరిశ్రమలను పొరుగు రాష్ట్రాలకు వెళ్లే పరిస్థితిని తెచ్చారన్నారు. మన భవిష్యత్ బాగుండాలంటే చంద్రబాబు లాంటి విజన్ ఉన్న నాయకుడు ముఖ్యమంత్రిగా ఉండాలన్నారు. ఆయనతోపాటు డైమండ్ ఇర్షాన్, మహమ్మద్‌వలీ, పీట్ల రమణమ్మ ఉన్నారు.

ఓటుతో రాష్ట్ర భవిష్యత్తు మారాలి



యువకులతో కలిసి పోస్టర్ ప్రదర్శిస్తున్న సామకోటి

బుక్కపట్నం, ఫిబ్రవరి 17: మీ తొలి ఓటుతో రాష్ట్ర భవిష్యత్ మారాలని టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ అన్నారు. శనివారం బుక్కపట్నంలోని డిగ్రీ కళాశాల ఆవరణంలో నూతన ఓటర్లకు ఆయన అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో ఎంత నష్టం జరిగిందో ఆలోచించాలన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో మీ మొదటి ఓటు చంద్రబాబునాయుడుకు వేసి, ఆయనను ముఖ్యమంత్రిని చేయాలని విజ్ఞప్తి చేశారు. మైనార్టీ నాయకులు సయ్యద్‌బాషా, టీడీపీ నాయకులు ఈశ్వరయ్య, జయరాములు, నూతన ఓటర్లు పాల్గొన్నారు.

మెరిట్ పరీక్షలో విద్యార్థి ప్రతిభ



సర్టిఫికెట్, ట్రోఫీని అందుకుంటున్న తులసీకార్తీక్

కొత్తచెరువు, ఫిబ్రవరి 17: రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఎడ్యుకేషనల్ ఎఫినీ ఆన్‌లైన్ మెరిట్ పరీక్షలో ధర్మవరం మున్సిపల్ బీఎస్ఆర్ బాలుర పాఠశాల విద్యార్థి తులసీకార్తీక్ ప్రతిభ కనబరచి ద్వితీయ స్థానంలో నిలిచినట్టు డీఈఓ మీనాక్షి తెలిపారు. ఈ పరీక్షను ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 7, 10 తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తారు. పరీక్షను శనివారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. పరీక్షలలో తులసీ కార్తీక్ ప్రతిభ కనబరచి ద్వితీయస్థానంలో నిలిచి సర్టిఫికెట్‌తో పాటు రూ.25వేలు నగదు బహుమతిని కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అధికారి సురేశ్‌కుమార్ చేతుల మీదుగా అందుకున్నట్టు ఆమె తెలిపారు.

వైసీపీ ప్రజావ్యతిరేక పాలనపై బీజేపీ పోరుబాట



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

పుట్టపర్తి, ఫిబ్రవరి 17: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలన సాగిస్తోందని, దీనిపై పోరుబాట చేపడుతున్నట్లు బీజేపీ రాష్ట్ర నాయకులు హరిక్రిష్ణగౌడ్, సుదర్శన్‌రెడ్డి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆ పార్టీ నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఒక్కఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్ నాలుగున్నర ఏళ్ల పాలనలో కల్లబొల్లి మాటలు చెబుతూ మభ్యపెట్టాడేతప్ప, ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. జగన్ అవినీతి పాలనను 21 నుంచి 29 వరకు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. పార్టీ నాయకులు ఉత్తంరెడ్డి, కత్తిరాజా, జ్యోతి ప్రసాద్, కొండమరాజు, బాలగంగాధర్, హనుమంతరాయుడు, శేషాద్రినాయుడు, సురేంద్ర, సాకే రామాంజి, సునీల్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆరాధనోత్సవాలు

ధర్మవరం, ఫిబ్రవరి 17: పట్టణంలోని సాయినగర్‌లో లక్ష్మీనరసింహస్వామి వద్దనున్న అవధూత తిక్కనారాయణస్వామి 52వ ఆరాధనోత్సవాలు 19, 20వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 19న అఖండనామ భజన బృందాలచే ఆలాపన, 20న గీతాపారాయణం, అన్నప్రసాద వితరణ, సాయంత్రం 4గంటలకు ఊరేగింపు, చెక్కభజన, అనంతరం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలిగా షకీరాబేగం



కొత్తచెరువు, ఫిబ్రవరి 17: కాంగ్రెస్ పార్టీ సత్యసాయి జిల్లా మహిళా అధ్యక్షురాలిగా తనను నియమించారని ఖాజీ షకీరా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ ఎంపికకు కృషిచేసిన రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు తాంతియా కుమారి, పీసీసీ ప్రసిడెంట్ వైఎస్‌షర్మిలా, ఏఐసీసీ మహిళా అధ్యక్షురాలు అల్కాంబ, సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి, వర్కింగ్‌ప్రసిడెంట్ జంగా గౌతం తదితరులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, ఫిబ్రవరి 17: విద్యాహక్కు చట్టం 2009 సెక్షన్ 12(1సీ) ప్రకారం 2024-25 విద్యా సంవత్సరానికి ఉచిత విద్యకు ఈ నెల 23వ తేదీ నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తామని డీఈఓ మీనాక్షి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రైవేటు పాఠశాలలో 1వతరగతిలో ప్రవేశం కోసం ఈనెల 23 నుంచి మార్చి 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె సూచించారు. విద్యార్థులు ఆధార్ కార్డు ద్వారా ప్రాథమిక వివరాలతో హెచ్‌టీటీపీ..//సీబీసీ.ఏపీ.జీఓవీ. ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు.

సమర్పించవలసిన డాక్యుమెంట్లు

ప్రస్తుత చిరునామా, ధ్రువీకరణ కోసం తల్లిదండ్రుల ఆధార్‌కార్డు, ఓటరు కార్డు, రేషన్‌కార్డు, జాబ్‌కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, విద్యుత్ బిల్లు ఏదైనా ఒక కాపీని దరఖాస్తుకు జతపరచాలన్నారు. జనన ధ్రువీకరణ పత్రం దరఖాస్తుకు తప్పనిసరిగా జతపరచాలన్నారు. ప్రైవేటు పాఠశాలలో 25శాతం కోటా కింద 1వతరగతిలో ప్రవేశం పొందడానికి దరఖాస్తులను జిల్లా విద్యాశాఖ అధికారి, ఏపీ సమగ్రశిక్షద్వారా ఆహ్వానిస్తున్నా మన్నారు. లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు.

ముంపు గ్రామాలకు పరిహారం ఎప్పుడు..?

- టీడీపీ వచ్చాక అందరికీ న్యాయం చేస్తాం
- భవిష్యత్తుకు గ్యారెంటీలో పరిటాల శ్రీరామ్



కరపత్రాలు అందజేస్తున్న పరిటాల శ్రీరామ్

ముదిగుబ్బ, ఫిబ్రవరి 17: చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కింద ముంపు గ్రామాలకు ఇంకెప్పుడు పరిహారం ఇస్తారని ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ ప్రశ్నించారు. మండలంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పీసీ రేవు, హస్సేన్‌పురం గ్రామా ల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. గ్రామాలకు వచ్చిన శ్రీరామ్‌కు స్థానికులు ఘనస్వాగతం పలికారు. నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికి వెళ్లి మినీ మేనిఫెస్టోలోని పథకాలను వివరించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను శ్రీరామ్ వద్ద ప్రజలు ఏకరువు పెట్టారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కింద గ్రామాలు, భూములు ముంపునకు గురైతే కొంతమందికి మాత్రమే పరిహారం ఇచ్చి, మిగిలిన వారికి అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పరిటాలశ్రీరామ్ మాట్లాడుతూ బాధితులను కూడా విభజించి పరిహారం అందించడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ గుడ్‌మార్నింగ్ కార్యక్రమం నిర్వహించే కేతిరెడ్డి ఎప్పుడైనా ఈ గ్రామాల సమస్యలు తెలుసుకున్నారా అని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కచ్చితంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ అరాచక ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని, మరో మూడు నెలల్లో ప్రజలకు మేలు చేసే టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పాటవుతుందని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు రమేష్‌బాబు, కరణంప్రభాకర్, అశ్వర్థరెడ్డి, తుమ్మల మనోహర్, సూర్యశేఖర్‌రాజు, కనుమ చంద్ర, కోట్ల బాబీ, గోపాల్‌రెడ్డి, ఆనంద్, వినోద్, రాజు, సూరి, గుర్రప్ప, ఓబులరాయుడు, నారాయణస్వామి, ఫకృద్దీన్, రంగనాయకులు, సూరి, శివయ్య, రంగయ్యనాయుడు పాల్గొన్నారు.



ధర్మవరం 7వ వార్డులో కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

సైకో పాలనకు చరమగీతం పాడుదాం

ధర్మవరం: సైకో సీఎం జగన్ పాలనకు చరమగీతం పాడుదామని టీడీపీ నాయకులు అన్నారు. శనివారం టీడీపీ పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో 7వ వార్డులో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ ముందుకెళ్తున్నారు. ఆదేవిధంగా వార్డులో ఏఏ సమస్యలున్నాయో కూడా అడిగితెలుసుకుంటూ టీడీపీ అధికారంలోకి వస్తే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, తెలుగుమహిళలుమాధనమహేశ్వరి,చౌడమ్మ, స్వర్ణకుమారి, మున్ని, శారద,నాగరత్న, రాళ్లపల్లిషరీఫ్, అంబటిసనత్, కరెంటు ఆది,పల్లపు రవీంద్ర, పల్లపు శివశంకర్, గోసల శ్రీరాములు, మాధవరెడ్డి, మారుతీస్వామి, అత్తర్‌రహీంబాషా, మాధనసుబ్బయ్య, కెహెచ్‌ప్రకాశ్, పుట్లూరు సంజీవులు, ఉస్మాన్, నాగేంద్ర, చెలిమి శివరాం, సురేశ్, వాసుదేవ, వీర పాల్గొన్నారు.



తాడిమర్రిలో...

తాడిమర్రి: మండలంలోని తురకవారిపల్లి, నాయనపల్లి గ్రామాలలో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని శనివారం టీడీపీ నాయకులు నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసి టీడీపీని ఆదరించాలని కోరారు. టీడీపీ మండల కన్వీనర్ కూచిరామ్మోహన్,టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జనార్ధన్ పతకమూరి, నాయకులు రఘురాంచౌదరి, ఆదినారాయణ, డీసీ శ్రీనివాసులు, విశ్వనాథ్, పక్కీర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, కొడెదల రాజశేఖర్, సాయి, కేసీఆర్, గణేశ్, రామానాయుడు, బద్రి పాల్గొన్నారు.

టీడీపీ గెలుపుతోనే గ్రామాల అభివృద్ధి



ధర్మవరం మండలం నిమ్మలకుంటలో...

ధర్మవరంరూరల్: రాష్ట్రంలో సీఎంగా చంద్రబాబును, ధర్మవరంలో ఎమ్మెల్యేగా పరిటాలశ్రీరామ్‌ను చేసుకుంటేనే గ్రామాలన్నీ అభివృద్ధి పథంలో నడుస్తాయని టీడీపీ నాయకులు అన్నారు. శనివారం మండలంలోని కత్తేకొట్టాల, నిమ్మలకుంట, మోటుమర్ల గ్రామాల్లో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి కరపత్రాలను పంచుతూ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కుణుతూరు వేణుగోపాల్‌రెడ్డి, మండలకన్వీనర్ పోతుకుంటలక్ష్మన్న, గొట్లూరుశ్రీనివాసులు, విజయసారథి, తలారివెంకటలక్ష్మి, రమణ, మద్దిలేటి, నిమ్మలకుంట కుళ్లాయప్ప, మల్లేనిపల్లి చంద్ర, గరుడంపల్లి చంద్రశేఖర్, అనిల్‌గౌడ్, పోతుకుంట రవి, బడన్నపల్లి క్రిష్ణ, లక్ష్మీనారాయణ, ఆదినారాయణ పాల్గొన్నారు.

బత్తలపల్లి: ఒక్క ఛాన్స్ అంటూ వచ్చిన జగన్‌ను ఓటు అనే ఆయుధంతో సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ నాయకులు అన్నారు. మండలంలోని ఓబుళాపురం పంచాయతీలో శనివారం బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కన్వీనర్ నారాయణరెడ్డి, గంటాపురం జగ్గు, సతీష్, సురేంద్రనాయుడు, చితంబర్‌రెడ్డి, క్రిష్ణయ్య పాల్గొన్నారు.



బత్తలపల్లి మండలం ఓబుళాపురంలో...

టీడీపీలోకి 28 కుటుంబాల చేరిక



పార్టీలోకి చేరిన వారితో పరిటాలశ్రీరామ్

ముదిగుబ్బ, ఫిబ్రవరి 17: మండలంలో పరిటాలశ్రీరామ్ పర్యటన సందర్భంగా పీ.సీ.రేవు గ్రామానికి చెంది 28 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. పరిటాలశ్రీరామ్ కండువాలు వేసి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

50 కుటుంబాల చేరిక

కదిరి: మండలంలోని ముత్యాలచెరువు గ్రామాలో 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. శనివారం నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ నివాసంలో వారు టీడీపీలో చేరారు. కందికుంట కండువాలు వేసి వారిని ఆహ్వానించారు. ముత్యాలచెరువుకు చెందిన జయచంద్రారెడ్డి, శ్రీనివాసులు, నరసింహులు, బాబా ఫకృద్దీన్, శ్రీరాములు, రాజశేఖర్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.



టీడీపీలో చేరినవారితో కందికుంట వెంకటప్రసాద్

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

తాడిమర్రి, ఫిబ్రవరి 17: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ మాధవరెడ్డి శనివారం తనిఖీ చేశారు. ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, ముదిగుబ్బ రూరల్ సీఐ క్రిష్ణంరాజు, సీఐ యతీంద్రలతో కలిసి పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. తాడిమర్రి తూర్పు చెరువుకట్టవద్ద ఎలాంటి ట్రాఫిక్ సమస్య రాకుండా ఉండేందుకు స్థలాన్ని పరిశీలించి పోలీసులకు సూచనలు చేశారు. పులివెందుల వైపు సిద్ధం సభకు వాహనాలలో వెళ్లే వారికి తాడిమర్రిలో భోజన ఏర్పాట్లు చేస్తుండగా అక్కడ ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగస్వామి పాల్గొన్నారు.

ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలి

బత్తలపల్లి: మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయంలేకుండా చూడాలని పోలీస్ సిబ్బందికి ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. రాప్తాడులో సీఎం జగన్ సిద్ధం సభ ఉండడంతో అనంతపురంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. అనంతపురం నుంచి బెంగళూరు వెళ్లే వాహనాలు సోములదొడ్డి, బుక్కరాయసముద్రం, నార్పల, బత్తలపల్లి, మీదుగా ధర్మవరం వెళుతుండటంతో బత్తలపల్లి నాలుగు రోడ్ల కూడలిని శనివారం ఎస్పీ పరిశీలించారు.



తాడిమర్రిలో ట్రాఫిక్ సమస్య గురించి తెలుసుకుంటున్న ఎస్పీ మాధవరెడ్డి

అలరించిన చైనా భక్తుల సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యం చేస్తున్న చైనా కళాకారులు

పుట్టపర్తి, ఫిబ్రవరి 17: చైనా భక్తులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. రెండోరోజు శనివారం సాయంత్రం సాయికుల్వంత్‌హాల్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. యూత్ చైనా సంప్రదాయ రీతిలో సంగీత నృత్యాన్ని ప్రదర్శించారు. అనంతరం సింగపూర్‌కు చెందిన ప్రముఖ సంగీత గాయకులు సుష్మ సోమ, అక్షయ్‌పద్మనాభ బృందం సంగీతగానకచేరి నిర్వహించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

రామాలయ నిర్మాణానికి రూ.50వేల విరాళం

నల్లచెరువు, ఫిబ్రవరి 17: మండలంలోని గొర్లవాండ్లపల్లి గ్రామంలో రామాలయ నిర్మాణానికి శనివారం కందికుంట వెంకటప్రసాద్ రూ.50 వేలు విరాళం అందచేశారు. గ్రామాన్ని సందర్శించిన ఆయన ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. అలాగే ఉబ్బిచెర్ల గ్రామానికి చెందిన రెడ్డప్ప ఇల్లు కూలిపోయిన విషయాన్ని తెలుసుకున్న ఆయన బాధితుడికి రూ.25 వేలు ఆర్థికసాయం అందజేశారు.

బాధ్యతగా పనిచేయండి



రికార్డులు పరిశీలిస్తున్న నోడల్ అధికారి

పుట్టపర్తి, ఫిబ్రవరి 17: గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేసి ప్రజలకు పారదర్శకంగా సేవలందించాలని జిల్లా గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి సూచించారు. శనివారం ఆయన ఎనుమలపల్లి 1, 2 సచివాలయాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది సాయిమోహన్, శివశంకర్‌రెడ్డి, చంద్రశేఖర్, రాజశేఖర్, వంశీకృష్ణ, కుల్లాయమ్మ పాల్గొన్నారు.


ప్రణాళిక తయారీపై సమావేశం

తనకల్లు, ఫిబ్రవరి 17: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల ప్రణాళికపై సమావేశాన్ని వైస్ ఎంపీపీ రమాదేవి అధ్యక్షతన అధికారులు నిర్వహించారు. ముఖ్యంగా 2024-25గాను సంబంధించి మండల ప్రణాళికలో ఎంపీటీసీలు, అధికారులు భాగస్వామ్యం కావాలని ఎంపీడీఓ పూల నరసింహులు కోరారు. ముఖ్యంగా నిధులు ఏఏ అంశాలకు ఖర్చు చేయాలి, ప్రభుత్వం నియమించిన గడువులో కేటాయింపులు ఎలా పూర్తి చేయాలన్న అంశాలపై వివరించారు. ముఖ్యమంగా తాగునీరు, పారిశుధ్యంతదితరాంశాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రణాళిక తయారీలో ఏఏ కార్యక్రమాలుచేపడతారో, ఆయా కార్యక్రమాల వివరాలను నమోదు చేయాలని కోరారు. ఈసమావేశంలో ఇఓఆర్‌డి ఆనందయ్య, డాక్టర్ లోకేశ్వర్‌రెడ్డి, ఎంఇఓలలితమ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ కవిత, ఏపీఎం వెంకటనారాయణ, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులున్నారు.

బిల్వంపల్లిలో దాహం.. దాహం...

- తాగునీటి కోసం ఇబ్బందులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 17: మా గొంతెండుతోంది, తాగునీటి కష్టాలు తీర్చండంటూ బిల్వంపల్లి గ్రామస్థులు వేడుకుంటున్నారు. మండలంలోని బిల్వంపల్లి గ్రామంలో తాగునీటి కోసం గ్రామస్థుల ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ప్రస్తుతం గ్రామంలో రెండు బోర్లు ఉన్నాయి. వాటిలో నీటి శాతం తగ్గిందని, బోర్లు మరమ్మతులకు గురవుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. 6 నెలలుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులెవరూ పట్టించుకోవడం లేదన్నారు. అరకొరగా వస్తున్న నీటి కోసం ప్రతి రోజు పనులకు కూడా వెళ్లకుండా ట్యాంకుల వద్ద వేచిచూడాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి కుటుంబం రోజుకు కేవలం నాలుగైదు బిందెలు మాత్రమే పట్టుకుంటున్నామని మహిళలు వాపోయారు. పశువులకు తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ఎండాకాలంలో ఇంకా ఎన్ని కష్టాలు పడాలో అంటూ గ్రామస్థులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి కష్టాలు తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అరకొర వచ్చే నీటిని పట్టుకుంటున్న గ్రామస్థులు

హత్యకేసులో నిందితులకు రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీలత

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 17: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడన్న నెపంతో భర్తను హత్య చేసిన కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ శ్రీలత తెలిపారు. శనివారం డీఎస్పీ కార్యాలయంలో సీఐ మోహన్‌తో కలిసి ఆమె విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. భర్త ఖాదర్‌బాషా కనిపించలేదని కదిరి మండలం సున్నపుగట్టతండాకు చెందిన గులాబ్‌జాన్ 3వ తేదీన స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామన్నారు. దర్యాప్తులో ఆమెపై అనుమానం రావడంతో నిఘా పెట్టామన్నారు. విషయం తెలుసుకున్న నిందితురాలు వీఆర్‌ఓ అమానుల్లా వద్దకెళ్లి పోలీసులు తమకోసం వెతుకుతున్నారని, భర్తను ప్రియునితో కలిసి చంపామని అతని వద్ద ఒప్పుకున్నట్లు చెప్పారు. వీఆర్‌ఓ సమాచారం మేరకు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. పట్టణానికి చెందిన బాబ్‌జాన్‌తో గులాబ్‌జాన్ వివాహేతర సంబంధం కొనసాగిస్తోందని, దీనిపై భర్త పలుమార్లు ప్రవర్తన మార్చుకోవాలని ఘర్షణపడేవారన్నారు. భర్తను అడ్డు తొలగించుకోవాలన్న ఉద్దేశ్యంతో జనవరి 31న రాత్రి, ప్రియుడు బాబ్‌జాన్, అతని స్నేహితుడు షామీర్‌తో కలిసి ఖాదర్‌బాషాను కట్టెలతో కొట్టి, గొంతు కోసి హత్య చేశారన్నారు. శవాన్ని మండలంలోని కారెడ్డిపల్లికి ద్విచక్రవాహనం తీసుకెళ్లి పెట్రోల్ పోసి నిప్పు అట్టించారు. శవం పూర్తిగా కాలకపోవడంతో ప్లాస్టిక్ సంచిలో సగం కాలినశవంతో పాటు రాళ్లు పెట్టి దగ్గరలో ఉన్న చెరువులో పడేసినట్లు విచారణలో వెల్లడైందన్నారు. గులాబ్‌జాన్, బాబ్‌జాన్‌ను రిమాండ్ తరలించామని, షామీర్ పరారీలో ఉన్నట్లు చెప్పారు. కేసును ఛేధించడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ మోహన్, సిబ్బంది సాల్మన్‌రాజు, భద్రు, వేమనారాయణ, మహిళా కానిస్టేబుల్ షాహీనాను ఎస్పీ మాధవరెడ్డి అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



అజయ్‌కుమార్ (ఫైల్)

ఓబుళదేవరచెరువు/నల్లమాడ, ఫిబ్రవరి 17: మండలంలోని మల్లాపల్లికి చెందిన లక్కసముద్రం అంజనేయులు కుమారుడు అజయ్‌కుమార్(22) అప్పుల బాధతో శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి అంజనేయులు తెలిపిన వివరాల మేరకు పెద్దకుమారుడు అజయ్‌కుమార్ బోలెరా వాహనం నడుపుకుండేవాడు. తమకున్న రెండు ఎకరాల పొలంలో నాలుగు బోర్లు వేశామని, ఏబోరులోనూ నీరు పడటం లేదన్నారు. రెండురోజుల క్రితం అప్పు చేసి ఐదో బోరు వేశామని, అందులో నీరు పడ్డాయన్నారు. బోర్ల కోసం చేసిన అప్పులకు తోడు బోలెరో వాహనానికి రూ.12లక్షలు ఫైనాన్స్ తీసుకున్నామన్నారు. తరచూ బోర్లకు, వాహనానికి అప్పులు ఎలా తీర్చాలని తనతో చెప్పి బాధపడేవాడన్నారు. శుక్రవారం రాత్రి పొలం వద్దకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడని, తెల్లవారినా ఇంటికి రాకపోవడంతో, తాను పొలం వద్దకెళ్లి చూడగా చింతచెట్టుకు ఉరివేసుకున్నట్లు గుర్తించానన్నారు. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపానన్నారు. ఆత్మహత్య చేసుకున్న పొలం నల్లమాడ మండలంలోని కురమాల పంచాయతీ పరిధి కావడంతో, నల్లమాడ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఏఎ్ససై సురేంద్రబాబు సంఘటనాస్థలానికి చేరుకుని, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

మండలంలోని మాల్లాపల్లిలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న అజయ్‌కుమార్ కుటుంబాన్నిమాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి శనివారం పరామర్శించారు. విషయం తెలుసుకున్న పల్లె కదిరి ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని, మృతుడి తండ్రి అంజనేయులును పరామర్శించారు. తనవంతుగా ఆర్థికసాయం అందించారు. తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షులు బూదిలి ఓబులరెడ్డి, సాంబశివారెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 17: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏజేఏపీ పిలుపుమేరకు కదిరి తాలూకా జేఏసీ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. శనివారం ఆర్‌అండ్‌బీ బంగ్లానుంచి అంబేడ్కర్ సర్కిల్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. ఆయన మాట్లాడుతూ డీఏ బకాయిలు, ఐఆర్, సరెండర్ లీవులు, మూడు సంవత్సరాలనుంచి పెడింగ్‌లో ఉన్నాయని,వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందచేశారు. హరిమోహన్, భైరశెట్టి, నబీరసూల్, రమేష్‌బాబు, ఆత్మారెడ్డి పాల్గొన్నారు.

చంద్రమౌళీశ్వరుడికి ప్రత్యేక పూజలు



నరసింహస్వామి అలంకరణలో చంద్రమౌళేశ్వరస్వామి

మడకశిరటౌన్, ఫిబ్రవరి 17: పట్టణ సమీపంలోని చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో శనివారం పురస్కరించుకొని స్వామివారిని నరసింహస్వామి అ లంకరణలో కొలువుదీర్చారు. శనివారం మాఘమాసం 8వరోజు కావడంతో స్వామివారికి ఉదయం నుంచే అభిషేకాలు, అర్చనలు, విశేష పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అలాగే పట్టణంలోని మిట్టబండ ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి ఆకుపూజ చేశారు. అభయాంజనేయస్వామి ఆలయంతోపాటు వివిధ ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.

బీసీల ఐక్యత సమావేశాన్ని విజయవంతం చేయండి : సామకోటి

గోరంట్ల, ఫిబ్రవరి 17: జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో ఈనెల 21న నిర్వహిస్తున్న బీసీల ఐక్యత సమావేశాన్ని విజయవంతం చేయాలని అఖిలపక్ష బీసీ జిల్లా గౌరవాధ్యక్షుడు సామకోటి ఆదినారాయణ పిలుపునిచ్చారు. ఆయన శనివారం గోరంట్లలోని బీసీ నాయకులతో అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నామాల శంకర్, ఉపాధ్యక్షులు గపూర్‌సాబ్, జయచంద్రమోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామకోటి మాట్లాడుతూ... పుట్టపర్తిలోని శిల్పారామంలో బీసీల ఐక్యత సమావేశాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అదేరోజు ఉదయం 10గంటలకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. బీసీలు చాలకాలంగా రాజకీయంగా అణచివేతకు గురవుతున్నారని తెలిపారు. రాజకీయ చైతన్యం కోసం ఈసమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీసీలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు నారాయణస్వామి, మదన్, వెంకటేష్, నందిని, ఆంజనేయులు, మనోహర్, నాగరాజు, చెన్నప్ప, రమణ, రామప్ప, అంజనేయులు తదితరులున్నారు.

కార్యకర్తలే టీడీపీకి బలం

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల



హనుమంతరాయప్ప భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిర రూరల్, ఫిబ్రవరి 17: తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పే స్వామి పేర్కొన్నారు. మండలంలోని బుళ్ళసముద్రం పంచాయతీ కేంద్రంలో టీడీపీ సీనియర్ నాయకుడు హనుమంతప్ప అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఈ విషయం తెలిసిన వెంటనే గుండుమల తిప్పే స్వామి ఆ గ్రామానికి వెళ్లి హనుమంతరాయప్ప భౌతిక కాయంపై పూలమాలు వేసి నివాళుల ర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చారు. అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ సీనియర్ నాయకుడు పూజారి గంగప్పను పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచులు జైపాల్, సంజీవప్ప, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నగేష్, యూనిట్ ఇన్‌చార్జ్ నాగేంద్ర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

చిలమత్తూరు, ఫిబ్రవరి 17: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో శెట్టిపల్లికి చెందిన తిప్పన్న (45) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. శెట్టిపల్లికి చెందిన తిప్పన్న తన ద్విచక్రవాహనంలో శనివారం రాత్రి తన స్వగ్రామం నుంచి కొడికొండ చెక్‌పోస్టుకు వెళుతున్నాడు. పాత హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తిప్పన్న తన వాహనంతో పాటు ఎగిరి రోడ్డుపై పడటంతో గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

కేబుల్ వైరు చోరీ

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 17 : మండలంలోని శెట్టిపల్లిలో తన పొలంలో ఉంచిన కేబుల్‌ను శుక్రవారం రాత్రి దుండగులు ఎత్తుకెళ్లినట్లు అదే గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి అనే రైతు తెలిపాడు. సాగుచేసిన పంటకు నీరు పెట్టేందుకు శుక్రవారం రాత్రి 12గంటల సమయంలో పొలంవద్దకు వెళ్లి చూడగా స్టార్టర్ పెట్టె నుంచి మోటారుకు అమర్చిన కేబుల్ కనిపించలేదన్నాడు. పరిశీలించాగా గుర్తుతెలియని వ్యక్తులు దానిని కత్తిరించుకుని వెళ్లిపోయారని గుర్తించామన్నారు. దాదాపు 100 మీటర్ల దాకా కేబుల్ ఉందని దాని విలువ రూ.10వేలు ఉంటుందని బాదిత రైతు వాపోయాడు. ఈ విషయంపై పెనుకొండ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేసినట్లు రైతు తెలిపాడు.

గడ్డివామి దగ్ధం

రొద్దం, ఫిబ్రవరి 17 : మండలంలోని పాతర్లపల్లి లో రైతు పెద్దనరసప్పకు చెందిన గడ్డివామి ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైంది. పాతర్లపల్లిలో తనకు చెందిన గడ్డివాము సమీపంలో వృధాగా ఉన్న చెత్తకు నిప్పంటించినట్టు బాధిత రైతు తెలిపాడు. అయితే నిప్పురవ్వలు గడ్డివామిపై పడి మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వారు వచ్చేలోపు గడ్డివామి పూర్తిగా కాలిపోయింది. అయితే ఇతర ప్రాంతాలకు నిప్పు వ్యాపించకుండా వారు ఆర్పేశారు. ఈ ప్రమాదంలో ఐదు బండ్ల వేరుశనగ, వరి, మొక్కజొన్న గడ్డివామి పూర్తిగా కాలిపోయి, రూ.25వేలు ఆస్తినష్టం వాటిల్లిందని రైతు తెలిపాడు.

ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ఏపీ జేఏసీ నాయకులు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు

మడకశిరటౌన్, ఫిబ్రవరి 17: ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జేఏసీ నాయకులు డిమాండ్‌చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు శనివారం మడకశిర తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉ ద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, కార్మికులకు సంబంధించిన 11వ పీఆర్‌సీ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. సరండర్‌లీవ్, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, ఉద్యోగ వర్గాలకు రావాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. 12వ పీఆర్‌సీ హక్కుల సాధన కోసం ఏపీ జేఏసీ పోరాడుతుందని తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించేంత వరకు తాము పోరాటం ఆపమని తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నియోజకవర్గ అధ్య క్షుడు రాము, యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న, ఎస్‌టీయూ జిల్లా కార్యదర్శి ఆది, పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జున, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం నాయకులు రామకృష్ణ, వెంకటేష్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల దరఖాస్తులను ఆన్‌లైన్ చేయించండి

కమిషనర్‌కు పలువురు పేదల వినతి



మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న దరఖాస్తుదారులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 17: ఇళ్ల పట్టాల కోసం చేసుకున్న ప్రతి ఒక్కరి దరఖాస్తును వార్డు సచివాలయాల్లో ఆన్‌లైన్ చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో చౌడేశ్వరీ కాలనీ, 32వ వార్డు, బాపూజీ నగర్ తదితర ప్రాంతాల పేదలు శనివారం మునిసిపల్ కార్యాలయం ముట్టడించారు. స్థానిక ఇందిరా పార్కు నుంచి ర్యాలీగా వెళ్లి మునిసిపల్ కార్యాలయం చేరుకొని అక్కడ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇల్లు లేని వారందరికి ఇల్లు మంజూరు చేయాలని, అదే విధంగా సచివాలయంలో ఆన్‌లైన్‌లోకి దరఖాస్తులను ఎక్కించా లన్నారు. చౌడేశ్వరీ కాలనీ, 32వ వార్డు సచివాలయాల్లో వీర్‌ఓలు పేదల అర్జీలను తీసుకోవడం లేదన్నారు. అలాగే బాపుజీనగర్ అడ్మిన్ దురుసుగా ప్రవర్తించడమే కాకుండా ఇళ్ల దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడం లేద న్నారు. పైఅధికారులకు తెలియజేస్తామని తెలిపినప్పటికీ దురుసుగా మాట్లాడుతున్నారని ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం కూడా పనికి రాని నల్ల రేగడి భూముల్లో సెంటు స్థలం ఇస్తోందని, అయితే అందులోనూ నిర్మాణాలు చేపట్టకపోవడం సరికాద న్నారు. నివాసానికి యోగ్యం కాని చోట ఇళ్ల నిర్మాణం చేపట్టడం శోచనీయమన్నారు. ఈ మేరకు మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు, కేవీపీఎస్ పట్టణ అధ్యక్షుడు రమణ, కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న, ఎస్ఎఫ్ఐ నాయకుడు బాబావలి, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతమ్మ, జిల్లా కమిటీ సభ్యులు రాయుడు, నరసింహులు, నాయకులు నసీంతాజ్, విమలకుమారి, నీలమ్మ, లక్ష్మీదేవమ్మ, ఆర్సియా తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జేసీ



లేపాక్షిలో పాఠశాలను పరిశీలిస్తున్న జేసీ అభిషేక్ కుమార్

లేపాక్షి, ఫిబ్రవరి 17 : త్వరలో జరగబోయే సార్వత్రి ఎన్నికల కోసం మండలం లో ఏర్పాటుచేసే పలు పోలింగ్ కేంద్రాలను శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ శనివారం పరిశీలించారు. లేపాక్షి, బయన్నపల్లి, కంచిసముద్రం, మద్దిపి, శిరివరం, గోపిందేవరపల్లి, మానెంపల్లి, గౌరిగానిపల్లిల్లో ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. పోలింగ్ నిర్వహించేందుకు పాఠశాల గదులను, సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సంబంధిత అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈఓ నాగరాజునాయక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించండి

- సబ్ కలెక్టర్ అపూర్వ భరత్

పెనుకొండ టౌన్ / పెనుకొండ రూరల్ , ఫిబ్రవరి 17 : రానున్న సార్వత్రిక ఎన్నికల కోసం ఏర్పాటు చేయనున్న పోలింగ్‌కేంద్రాలలో అన్ని వసతులు పకడ్బందీగా ఏర్పాటు చేయాలని సబ్ కలెక్టర్ అపూర్వభరత్ సూచించారు. ఆయన శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాల యంలో సెక్టార్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ... కేటాయించిన సెక్టార్ అధికారులు వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి నీరు, విద్యుత్, మరుగుదొడ్లు, కనీస సౌకర్యాలపై నివేదికలు ఇవ్వాలని తెలిపారు. అనంతరం పెనుకొండ నగర పంచాయతీ లోని కోనాపురం, మంగాపురం, వెంకటరెడ్డిపల్లి, ఇస్లాపురం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయన పెనుకొండ పరిధిలోని 11పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలలో అవసరమయ్యే మౌలిక వసతులపై స్థానిక సచివాలయ ఉద్యోగులతో ఆరాతీశారు.

ఘర్షణలకు పాల్పడితే చర్యలు : ఎస్ఐ

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 17 : చిన్న చిన్న గొడవలతో ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాజేష్ తెలిపారు. ఆయన శనివారం పెనుకొండ నగర పంచాయతీ కోనాపురంలో ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలని, గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ క్రైంలు ఎక్కువ అవుతున్న తరుణంలో అపరిచిత వ్య క్తులు ఫోన్‌చేసి ఓటీపీలు అడిగినప్పుడు చెప్పకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీపై ప్రచారం



సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న డాక్టర్ కృష్ణమూర్తి తదితరులు

రొళ్ల, ఫిబ్రవరి 17: బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంపై టీడీపీ నాయకులు శనివారం మండల కేంద్రంతోపాటు బీజీ హళ్లి, హానిసేకుంట, ఎం రాయాపురం, సోమగట్ట, చిగమతిగట్ట గ్రామాల్లో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వారు ఆయా గ్రామాల్లో సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు డాక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించే సమయం ఆసన్నమయిందని అన్నారు. ప్రజలందరూ సమాలోచితంగా నిర్ణయం తీసుకుని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి పట్టంకట్టి అభివృద్ధిని ప్రోత్సహించాలని కోరారు. ఈసందర్భంగా తెలుగు యువత నాయకుడు బాలకృష్ణ, టీడీపీ నాయకులు తిప్పేస్వామి, గోవిందప్ప, సన్నమారప్ప తదితరులు పాల్గొన్నారు.

32 బస్సుల్లో 22 సిద్ధం సభకు..!

మడకశిరటౌన్, ఫిబ్రవరి 17: ఆర్టీసీ మడకశిర డిపోలో 32 బస్సులు ఉండగా అందులో 22 బస్సులు ఆదివారం అనంతపురం జిల్లాలోని రాప్తాడు వద్ద జరిగే సిద్ధం సభకు వెళ్లనున్నట్లు ఆర్టీసీ సిబ్బంది ద్వారా తెలిసింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రానున్న నేపథ్యంలో మడకశిర నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున జనసమీకరణ కోసం ఆర్టీసీ బస్సులతోపాటు ప్రైవేట్ వాహనాలను వైసీపీ శ్రేణులు సిద్ధం చేస్తున్నారు. ఆదివారం మడకశిర నియోజకవర్గం వ్యాప్తంగా ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంటుందని ప్రజలు అంటున్నారు. ఆర్టీసీ బస్సులు అన్నీ ఉదయాన్నే ఏఏ గ్రామాల నుంచి బయలు దేరాలి అనేది నాయకుల సూచనల మేరకు కేటాయించనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఖైదీల ఆరోగ్యంపట్ల శ్రద్ధ చూపండి

జిల్లా అదనపు కోర్టు న్యాయాధికారి శైలజ



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయాధికారి శైలజ

హిందూపురం, ఫిబ్రవరి 17 : సబ్ జైలులో ఉన్న ఖైదీల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని హిందూపురం జిల్లా అదనపు న్యాయాధికారి శైలజ అన్నారు. న్యాయాధికారి శనివారం స్థానిక సబ్‌జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏఏ కేసుల్లో జైలులో ఉన్నారని ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందుతున్న సౌకర్యాలపై ఆరాతీశారు. న్యాయవాదులను పెట్టుకునేందుకు ఆర్థిక స్తోమతలేని ఖైదీలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. దీంతోపాటు పీటీవారెంట్‌పై జైలులో ఉన్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు వాకబు చేయాలని జైలు అధికారులను ఆదేశించారు. ఎవరైనా అనారోగ్యం బారిన పడితే వెంటనే వైద్యం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌జైలర్ అంజినాయక్, డా.ఆనంద్‌బాబు, న్యాయవాదులు సుదర్శన్, నాగరాజరెడ్డి, పార్వతి, రవికుమార్ తదితరులు ఉన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

- న్యాయాధికారులు

పెనుకొండ, ఫిబ్రవరి 17 :

పట్టణంలోని కోర్టులో మార్చి 9న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు లోక్‌అదాలత్ చైర్మన్ శంకర్‌రావు, జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ముజీబ్ పసపల సయ్యద్ తెలిపారు. న్యాయా ధికారులు శనివారం స్థానిక కోర్టు హాలులో న్యాయవాదులు, బార్ అసోసి యేషన్ సభ్యులతో లోక్ అదాలత్ నిర్వహణపై సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా న్యాయాధికారులు మాట్లాడుతూ... లోక్‌అదాలత్‌లో బ్యాంక్‌కు సంబంధించిన కేసులు, రాజీకాదగిన క్రిమినల్ కేసులు, చెక్‌బౌన్స్, భరణం, సివిల్, ప్రాంసరి నోటు కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ సదవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా న్యాయవాదులు చూడాలన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, ఏజీపీ భాస్కర్‌రెడ్డి, న్యాయవాదులు శర్మ, నాగిరెడ్డి, అశ్వర్థనారాయణ, నాగార్జున, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

'చదువుతోనే అభివృద్ధి సాధ్యం'

అగళి, ఫిబ్రవరి 17 : గ్రామాల్లో పేదరికం పోవాలంటే చదువే కీలకమని, చదువుకోవడంవల్ల అభివృద్ధి సాధించవచ్చని ఆర్డీటీ మడకశిర రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున పేర్కొన్నారు. ఆ సంస్థ స్పెయిన్ ప్రతినిధులు శనివారం అగళి మండల ఆలూడి గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..... ప్రజలు ఐకమత్యంతో కలిసి మెలిసి జీవించాలని సూచిం చారు. అలాగే రాబోయే రోజుల్లో ఆలూడి ప్రజలకు అవసరమైన విద్య, గృహ నిర్మాణం కార్యక్రమాలను ఆర్డీటీ ద్వారా చేపట్టడానికి ప్రయత్నిస్తామని రొళ్ల, అగళి మండలాల ఏరియా టీమ్‌లీడర్ ఓబులేసు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రవికుమార్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం రెండో రోజూ ఆందోళన

తహసీల్దార్ కార్యాలయం వద్దే వంటావార్పు



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు, గ్రామస్థులు

గోరంట్ల, ఫిబ్రవరి 17: తమకు ఇళ్ల స్థలాలు చూపాలంటూ పాలసముద్రం వాసులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనను రెండో రోజు శనివారం మరింత ఉధృతం చేశారు. సీపీఎం నాయకులు హనుమయ్య, వెంకటేష్ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన విషయం తెలిసిందే. అధికారులు తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేసి వెళ్లినా, వారు అక్కడే బైఠాయించారు. రాత్రి కార్యాలయం వద్దే నిద్రించి, ఉదయమే వంటావార్పు చేస్తూ ఆందోళన కొనసాగించారు. శనివారం ఉదయం 9గంటల సమయంలో కార్యాలయ తాళాలు తీయడానికి వచ్చిన సిబ్బందికి మహిళలు అడ్డుగా కూర్చొని నిరసన తెలిపారు. తరువాత వచ్చిన డీటీ రెడ్డిశేఖర్ ఇతర రెవెన్యూ సిబ్బంది బయటే నిలబడ్డాల్సి వచ్చింది. వారు ఈ విషయంపై మండలంలోని పోలింగ్ కేంద్రాల పరిశీలనకు వెళ్లిన తహసీల్దార్ అక్బల్‌బాషాకు సమాచారం అందించారు. తహసీల్దార్ ఉదయం 11.45గంటలకు తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని, పోలీసుల సమక్షంలో ఆందోళన కారులతో చర్చించారు. వారు ససేమిరా అనడంతో... సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ అధికారులు ఫోన్‌ద్వారా అధికారులతో మాట్లాడిన ఆందోళన విరమించారు. ఆన్‌లైన్‌లో నమోదు కాని వారు ఇళ్లకోసం నూతనంగా దరఖాస్తు చేసుకుంటే తహసీల్దార్ పరిశీలిస్తామని చెప్పారు. చర్చల్లో తహసీల్దార్‌తోపాటు సీఐ సుబ్బరాయుడున్నారు.

భక్తిశ్రద్ధలతో దీపోత్సవం



ప్రత్యేక అలంకరణలో కోడి రంగనాథస్వామి

లేపాక్షి, ఫిబ్రవరి 17 : మండలంలోని శిరివరం గ్రామంలో వెలసిన కోడి రంగనాథ స్వామికి శనివారం గ్రామస్థులు దీపోత్సవాన్ని నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో ఇళ్ల వద్ద ప్రత్యేకంగా దీపాల ను ఏర్పాటు చేసుకున్నారు. వాటిని ఊరేగింపుగా దేవాలయం వద్దకు తీసుకెళ్లి స్వామివారికి సమర్పించారు. దీపోత్సవం సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. బంధువులతో ఇళ్లు కిటకిటలాడాయి. మహిళలు, భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.



దీపాలను మోసుకెళ్తున్న మహిళలు, చిన్నారులు

ఘనంగా ఉట్ల పరుష



ఉట్లమాను ఎక్కేందుకు యువత ఉత్సాహం

గుడిబండ, ఫిబ్రవరి 17 : మండలంలోని హిరేతుర్పి గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి ఉత్సవాల్లో భాగంగా శనివారం గ్రామస్థుల ఆధ్వర్యంలో ఉట్లపరుష కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్ గొల్లహట్టి గ్రామానికి చెందిన యువకులు ఉట్లమాను ఎక్కేందుకు పోటీపడ్డారు. ఎస్ గొల్లహట్టి చెందిన కసాపురం రాజు అనే యువకుడు ఉట్లమాను ఎక్కి విజేతగా నిలిచాడు. గ్రామస్థులు అతడిని అభినందించారు. ఉట్లపరుషను వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామస్థులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు

అడ్డుకున్న అధికారులు



మట్టిని తరలిస్తున్న వాహనాలను నిలిపివేసిన అధికారులు

మడకశిర రూరల్, ఫిబ్రవరి 17: మండలంలోని హరేసముద్రం చెరువు నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని తరలించడాన్ని రెవెన్యూ, ఇరిగేషన్ అధికా రులు అడ్డుకున్నారు. ఒక ఎక్స్‌కవేటర్, మూడు టిప్పర్లుతో చెరువు మట్టిని శనివారం తరలిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖకు సమాచారం అందించారు. వీఆర్‌ఓ శశాంక్, ఇరిగేషన్ ఏఈ భార్గవ్ వెంటనే హరేసముద్రం చెరువు వద్దకు వెళ్లారు. మట్టి తవ్వ కాలను, తరలింపును అడ్డుకున్నారు. అనుమతి లేకుండా చెరువులోని మట్టిని తవ్వకూడదని నిలిపివేయించారు. దీంతో మట్టి తరలింపు చేపట్టిన వారు వాహనాలతో వెనుదిరిగి వెళ్లారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి


మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి



విద్యార్థులు చేసిన ప్రయోగాలను పరిశీలిస్తున్న కమిషనర్, ఎంఈఓలు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 17: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మునిసిపల్ కమిష నర్ శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పాంచజన్య బ్రిలియంట్ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన ఫ్యూజన్ విజన్ అనే సైన్స్‌ఫెయిర్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు తయారుచేసి ప్రదర్శించిన ప్రయోగాలను ఆయన పరిశీలించారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకత బహిర్గతమవుతుందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సీతారామ లక్ష్మణ ఆంజనేయ, రావణాసుర, వేషధారణలు, అయోధ్యా రామమందిరం నమూనా విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓ గంగప్ప, ఎంఈఓ- 2 ప్రసన్నలక్ష్మి, పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాసులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ చైతన్య రథయాత్ర



చైతన్య రథయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

పావగడ, ఫిబ్రవరి 17: అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ చైతన్య రథయాత్రను పావగడ పట్టణంలో శనివారం వైభవంగా ప్రారంభించారు. ఉదయం 8 గంటలకు స్థానిక తాలూకా ఐబీ నుంచి శనిమహాత్మ సర్కిల్ వరకు ఊరేగింపుగా వెళ్లారు. మన్సిపల్ కార్యాలయ ఆవరణంలో సభ నిర్వహించారు. ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ జ్యోతి వెలిగించి మాట్లాడుతూ... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమే మనమందరం ఈవేదికపై కూర్చోవడానికి అవకాశం కల్పించిందన్నారు. ఆయన ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కేవలం ఒక వర్గానికే కాకుండా ప్రతి ఒక్కరికి మనుగడ చూపించిన గొప్ప వ్యక్తి అంబేడ్కర్ అని తహసీల్దార్ నరసింహమూర్తి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, విద్యార్థులు, దళితనాయకులు పాల్గొన్నారు. అయితే రథయాత్ర పావగడకు వచ్చినా ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ సమయానికి రాకపోవడంతో దళిత సంఘం నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అధికారుల సమన్వయ లోపం వల్ల పొరపాటు జరిగిందని అంబేడ్కర్ ప్రతి ఒక్కరికి ఆదర్శ ప్రాయుడని ఎమ్మెల్యే సర్దిచెప్పడంతో వారు శాంతించారు.

లబ్ధిదారులకు గంగా కల్యాణి సామగ్రి పంపిణీ

పావగడ, ఫిబ్రవరి 17: కర్ణాటక ఆదిజాంబవ కార్పొరేషన్ నుంచి గంగా కల్యాణి పథకం కింద 19 మంది రైతులకు బోర్‌వెల్ సామాగ్రిని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్, డీఎం జయరామయ్య చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. 2022-23 సంవత్సరంలో ఈపథకం కింద 19 మంది రైతులకు కార్పొరేషన్ నుంచి బోర్లు తవ్వించారు. వాటి ద్వారా వ్యవసాయ భూములుగా సాగు చేయడానికి రూ.5లక్షలు విలువచేసే రైతులకు అవసరమైన పంపుసెట్లు, పైపులు, స్విచ్ బోర్డులను పంపిణీ చేసినట్లు డీఎం జయరామయ్య తెలియజేశారు.